
నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 8 ఏప్రిల్ 2025 | NIZAMABAD

- కేసీఆర్ పాలన దేశానికే దిక్సూచి
- కాంగ్రెస్ పాలనలో భవిష్యత్తు ప్రశ్నార్థకం
- హామీల అమలులో రేవంత్ సర్కారు విఫలం
- దుష్ట పాలనపై రగులుతున్న తెలంగాణ
- సబ్బండ వర్గాలు తిరగబడడం ఖాయం
- ఓరుగల్లు జన జాతరకు కదం తొక్కాలి..
- మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పిలుపు
- ఆర్మూర్‌లో బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశం



వేల్పూర్‌లో నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

# తెలంగాణ ఆత్మగౌరవపతాక బీఆర్‌ఎస్



సమావేశానికి హాజరైన నాయకులు.. మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి



ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 7: ఈ నెల 27న వరంగల్ గడ్డపై నిర్వహించనున్న ఓరుగల్లు జన జాతర.. కాంగ్రెస్ పార్టీ దుష్ట పాలనకు పాతర అని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ పాలన దేశానికి దిక్సూచిగా నిలిస్తే కాంగ్రెస్ పాలనలో తెలంగాణ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న రజతోత్సవ సభ విజయవంతం చేయడానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సోమవారం ఆర్మూర్‌లో ముఖ్య నేతలతో జీవన్‌రెడ్డి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ రజతోత్సవం.. పాతికేండ్ల సమరోత్సాహమని అన్నారు. బీఆర్‌ఎస్ తెలంగాణ ఆత్మగౌరవ పతాక, పేదల గొంతుక అని అన్నారు. తెలంగాణ సబ్బండ వర్గాల ఆకాంక్షల నుంచి పుట్టిన పార్టీ 14 ఏండ్ల పోరాటం, పదేండ్ల సంక్షేమ మేళవింపుతో కూడిన బీఆర్‌ఎస్ ప్రస్థానం చరిత్రలో నిలిచి పోతుందన్నారు. చావు నోట్లు తలపెట్టి, ఢిల్లీని కదిలించి స్వరాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్.. పదేండ్ల పాలనలో తెలంగాణను దేశంలో ముందుంచారన్నారు. కేసీఆర్ ప్రారంభించిన మిషన్ భగీరథ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, రైతుబంధు పథకం పీఎం కిసాన్ పథకానికి ప్రేరణగా నిలిచిందని చెప్పారు. దేశంలో అత్యంత ఎక్కువగా వరి పండించే రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దారని గుర్తు చేశారు. రైతు బంధు, రైతుబీమా, వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చిన ఘతన కేసీఆర్‌దేనని తెలిపారు. ఇచ్చిన హామీలే కాదు ఇవ్వని హామీలు కూడా అమలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద 13 లక్షల పేదింటి ఆడబిడ్డల వివాహాల కోసం రూ.11 వేల కోట్లు ఖర్చు చేశారని చెప్పారు.

### అమ్మకాల రేవంత్

మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చిందని జీవన్‌రెడ్డి మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణను అమ్మకానికి పెట్టారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీల అమలులో ఘోరంగా విఫలమయ్యారన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ఒక్కటే అమలు చేసి మిగతా వాటికి మంగళం పాడారన్నారు. పింఛన్లు పెంచలేదని, రుణమాఫీ చేయలేదని విమర్శించారు. రేవంత్ దుష్ట పాలనపై తెలంగాణ రగులుతున్నదని, సబ్బండ వర్గాలు తిరగబడాలని పిలుపునిచ్చారు. ఇక్కడి బీజేపీ నేతలకు తెలంగాణ మట్టి వాసనే గిట్టదని, వారు గుజరాత్ గులాంలుగా మారారని జీవన్‌రెడ్డి విమర్శించారు. బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి, గంగామోహన్ చక్రు, పోల సుధాకర్, మీరా శ్రవణ్, క్రాంతి, మామిడిపల్లి రాజా, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేసీఆర్ వల్లే అగ్రగామిగా తెలంగాణ

- పదేండ్లలో మానవీయ కోణంలో పాలన
- సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- వేల్పూర్‌లో ముఖ్య నేతలతో సన్నాహక సమావేశం
- బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తరలి రావాలని పిలుపు

మోర్తాడ్/వేల్పూర్, ఏప్రిల్ 7: బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావం సందర్భంగా వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించనున్న రజతోత్సవ సభకు బాల్కొండ నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం వేల్పూర్‌లో పార్టీ ముఖ్య నేతలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. 60 ఏండ్లుగా ఆంధ్ర పాలకుల కబంధ హస్తాల్లో నలిగిన తెలంగాణ విముక్తి కోసం ఆనాడు కేసీఆర్ ఒక్కడిగా బయల్దేరారన్నారు. 2001లో పార్టీని స్థాపించి 14 ఏండ్లుగా శాంతియుతంగా అనేక పంథాల్లో ఉద్యమాన్ని ముందుండి నడిపించిన గొప్ప నాయకుడు కేసీఆర్.. సబ్బండ వర్ణాలను ఒక్కతాటిపైకి తెచ్చి పార్లమెంటరీ పంథాలో రాష్ట్రాన్ని సాధించారని చెప్పారు. కొట్లాడి తెచ్చిన తెలంగాణలో పదేండ్లు మానవీయ కోణంలో పరిపాలన అందించారని గుర్తు చేశారు. ఇటు పేదల సంక్షేమం, అటు అభివృద్ధిని సమాంతరంగా పరిగెత్తించి తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపారన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతోనే బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయిందని ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. అధికారం పోయినప్పటికీ ఉద్యమం చేసి పార్టీ కార్యకర్తలు చురుకైన ప్రతిపక్షంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల పక్షాన పోరాడుతున్నారని తెలిపారు. అయినోడు, కానోడు, తెలిసినోడు తెలనోడు బీఆర్‌ఎస్‌పై నోటికొచ్చినట్లు వాగుతున్నారని, అలాంటి వారందరికీ సమాధానం చెప్పడానికి వరంగల్ సభ వేదిక కానున్నదన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో వరంగల్ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. వరంగల్ సభను విజయవంతం చేయడానికి రానున్న మూడు రోజుల్లో గ్రామగ్రామాన సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ నాయకుడు కొత్తూర్ లక్ష్మారెడ్డి, అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.



# గులాబీ జోష్..

## బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు

- ఓరుగల్లు సభకు తరలి వెళ్లేందుకు సన్నాహాలు
- ఉమ్మడి జిల్లా నుంచి భారీగా తరలివెళ్లేందుకు ఏర్పాట్లు
- సన్నాహక సమావేశాల్లో బిజీ బిజీగా నాయకులు
- వేల్పూర్, ఆర్మూర్, కామారెడ్డిలోముఖ్య నేతలతో సమావేశాలు
- సభను విజయవంతం చేయాలని వేముల, జీవన్‌రెడ్డి,గంప గోవర్ధన్ పిలుపు

*బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లలో గులాబీ దండు నిమగ్నమైంది. ఓరుగల్లు గడ్డపై నిర్వహించనున్న రజతోత్సవాలకు తరలి వెళ్లేందుకు సిద్ధమైంది. వరంగల్ సభను విజయవంతం చేసేందుకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నేతలు నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి వేల్పూర్‌లో అనుచరులతో సోమవారం సమావేశమయ్యారు. సభ విజయవంతానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఆర్మూర్‌లో నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, కామారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామం నుంచి నేతలు, కార్యకర్తలు భారీగా ఓరుగల్లు సభకు తరలి వచ్చేలా చూడాలని సూచించారు. మరోవైపు, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, జీవన్‌రెడ్డి సమక్షంలో నగరానికి చెందిన మైనార్టీ యువకులు భారీగా గులాబీ గూటికి చేరారు. వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.*

# ఓరుగల్లుకు దండు కట్టాలి

**-కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్**

కామారెడ్డి, ఏప్రిల్ 7: ఈ నెల 27వ తేదీన వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ నేతలు, కార్యకర్తలు భారీగా తరలి రావాలని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్ గంప గోవర్ధన్ పిలుపునిచ్చారు. సోమవారం కామారెడ్డిలోని తన నివాసంలో పార్టీ ముఖ్య నాయకులతో రజతోత్సవ సభకు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. ఓరుగల్లులో నిర్వహించనున్న సభకు కామారెడ్డి నియోజకవర్గం నుంచి 3 వేల మంది కార్యకర్తలు తరలి రావాలని నిర్ణయించారని, కానీ అంతకంటే ఎక్కువగా వెళ్లి సభను విజయవంతం చేయాలని సూచించారు. ఈ నెల 27న అన్ని గ్రామాల్లో గులాబీ జెండాను ఆవిష్కరించాక వరంగల్‌కు బయల్దేరాలని సూచించారు. చరిత్రలో నిలిచిపోయేలా 1500 ఎకరాల్లో నిర్వహిస్తున్న ఈ సభను విజయవంతం చేయడానికి నియోజకవర్గంలోని ప్రధాన చౌరస్తాల్లో వాల్ పెయింటింగ్, పార్టీ నినాదాలు ముద్రిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి నుంచి ప్రజలను చైతన్యవంతులను చేయడానికి, సభకు తరలిరావడానికి ఇంటింటి ప్రచారం నిర్వహించాలని నాయకులకు సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వరంగల్ సభకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ రాంరెడ్డి, గంధ్ర మధుసూదన్, మాజీ ఎంపీపీలు బాలమణి, పిప్పిరి ఆంజనేయులు, బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు బలవంత్‌రావు, శ్రీనివాస్ గౌడ్, జుకంటి మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, నల్లవెల్లి అశోక్, గోపిగౌడ్, రవియాదవ్ పాల్గొన్నారు.



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

# బీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు



గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్ గుప్తా, జీవన్‌రెడ్డి

- కండువాలు కప్పి ఆహ్వానించిన జీవన్‌రెడ్డి, బిగాల
- వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే..
- మాజీ ఎమ్మెల్యే బిగాల ధీమా
- కాంగ్రెస్‌కు పది సీట్లు కూడా రావన్న గణేశ్‌గుప్తా
- కేసీఆర్ అంటే నమ్మకం..
- మోదీ, రేవంత్ అంటే అమ్మకం
- మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ధ్వజం

నిజామాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) :నిజామాబాద్ నగరానికి చెందిన మైనార్టీ నేతలు భారీ సంఖ్యలో సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. నిజామాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్ గుప్తా ఆధ్వర్యంలో భారీగా చేరికలు జరిగాయి. నగరంలోని డివిజన్ 12, 30, 31 నుంచి మహ్మద్ ఇర్ఫాన్, మహ్మద్ మాజీద్, మహ్మద్ జైను, మహ్మద్ నయీం, మహ్మద్ అలీం నేతృత్వంలో పెద్ద సంఖ్యలో చేరిన మైనార్టీలకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కేసీఆర్‌పై ప్రజల్లో ప్రేమ తగ్గలేదని, అందుకు నిదర్శనమే ఈ చేరికలు అని పార్టీ నేతలు తెలిపారు.

### అంధకారంలో ఇందూరు: బిగాల



బీఆర్‌ఎస్ పాలనలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో వెలుగులు విరజిమ్మితే ఇప్పుడు అంధకారం అలుముకున్నదని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా ఆవేదన వ్యక్తం చేశారు. తాము పెట్టిన చెట్లకు ప్రస్తుత ఎమ్మెల్యే కనీసం నీళ్లు కూడా పోయించడం లేదన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం బీఆర్‌ఎస్ అధికారంలో లేకపోయినప్పటికీ పార్టీలో చేరుతామంటూ మైనార్టీ యువత పెద్ద ఎత్తున ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. 'మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏమీ చేయట్లేదని ప్రజలకు అర్థమైంది. పేదల ప్రభుత్వంగా గుర్తింపు పొందిన బీఆర్‌ఎస్ పార్టీని అనవసరంగా వదులుకున్నామని ఇప్పుడు బాధ పడుతున్నారని' బిగాల తెలిపారు. 'మా పాలనలో కేసీఆర్ కిట్, షాదీముబారక్, ఆసరా పింఛన్లు ఇలా ఒకటేమిటి అనేక పథకాలను అందించాం. పేదల కోసం ఆలోచించిన వ్యక్తి కేసీఆర్ మాత్రమే. మా హయాంలో నిజామాబాద్ అర్బన్‌లో గల్లీ గల్లీలో చమ్కా దియా. ఇప్పుడు నిజామాబాద్ హాలత్ మొత్తం ఖరాబ్ అయ్యిందని' అన్నారు. రానున్న రోజులు బీఆర్‌ఎస్‌వే. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే గులాబీ పార్టీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు 10 సీట్లు కూడా రావన్నారు. కేసీఆర్ సీఎం కావడం ఖాయమని సర్వేలు చెబుతున్నాయన్నారు. పదేండ్ల పాలన తర్వాత బీఆర్‌ఎస్‌పై వ్యతిరేకత వస్తే, 10 నెలల్లోనే కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందని తెలిపారు.

### భూములపై కాంగ్రెస్ కన్ను: జీవన్‌రెడ్డి



బీఆర్‌ఎస్‌లో చేరిన మైనార్టీ యువకులను చూస్తుంటే వచ్చే ఎన్నికల్లో బిగాల గణేశ్ గుప్తా 50 వేల మెజార్టీతో గెలవడం ఖాయంగా కనిపిస్తున్నదని జీవన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వస్తే మార్పు వస్తదని అన్నారని, మార్పు ఏమిటో ప్రజలకు బాగానే అర్థమైందన్నారు. 'మార్పు కావాలంటే బాగా మార్పు తెచ్చిండు. మిషన్ భగీరథ నీళ్లు రావట్లేదు. బీఆర్‌ఎస్‌ను ఓడించినందుకు మాకు అనుభవం అయ్యిందని అంటున్నారని' జీవన్‌రెడ్డి తెలిపారు. గల్లీలో, గ్రామాల్లో ఎక్కడ చూసినా సార్ కావాలి. కేసీఆర్ రావాలి అంటున్నారన్నారు. బడే భాయ్ మోదీ ఎయిర్ పోర్ట్, సీ పోర్ట్ అమ్మితే.. చోటే భాయ్ రేవంత్‌రెడ్డి ఒకడుగు ముందుకేసి యూనివర్సిటీ భూములు అమ్ముతున్నాడని మండిపడ్డారు. గిరిరాజ్ కాలేజీతో పాటు ఆర్మూర్‌లోని 60 ఎకరాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భూములపై కాంగ్రెస్ నేతలు కన్నేసినట్లు తెలిసిందనారు. హెచ్‌సీయూ భూములను అమ్మనిస్తే వచ్చే రోజుల్లో నిజామాబాద్, ఆర్మూర్‌లో భూములను కాంగ్రెస్ నేతలు అమ్మేస్తారని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ నాయకులు సుజిత్ సింగ్ ఠాకూర్, నీతూకిరణ్, ప్రభాకర్‌రెడ్డి, సత్య ప్రకాశ్, జగత్‌రెడ్డి, మతిన్, ఇమ్రాన్, నవీన్ ఇక్బాల్, సనాఉల్లా తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ కల్లు కలకలం..



దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితులు

- 50 మందికి అస్వస్థత.. 13 మంది పరిస్థితి విషమం
- దవాఖానల్లో చికిత్స పొందుతున్న బాధితులు
- పరామర్శించిన సబ్ కలెక్టర్ కిరణ్మయి
- దుకాణాల లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశం
- కల్తీ కల్లు దందాపై ముందే హెచ్చరించిన 'నమస్తే తెలంగాణ'

బాన్సువాడ, ఏప్రిల్ 7: బాన్సువాడ డివిజన్‌లో కల్తీ కల్లు తాగి పలువురు అస్వస్థతకు గురి కావడం కలకలం రేపింది. 50 మంది దవాఖానలో చేరడంతో కల్తీ కల్లు ఉదంతం మరోమారు చర్చనీయాంశమైంది. నస్రుల్లాబాద్ మండలంలోని అంకోల్, అంకోల్ క్యాంపు, దుర్కితో పాటు బీర్కూర్ మండలంలోని దామరంచ గ్రామంలో కల్తీ కల్లు కలకలం రేపింది. ఆయా గ్రామాలకు చెందిన 50 మంది కల్లు తాగి అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని హుటాహుటిన బాన్సువాడ దవాఖానకు తరలించారు. అందులో 13 మంది పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు నిజామాబాద్‌కు తీసుకెళ్లారు. కల్తీ కల్లు బాధితులను సబ్ కలెక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి పరామర్శించారు. డీఎంహెచ్‌వోకు ఫోన్ చేసి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

**ఆర్‌ఎంవో లేకపోవడంపై ఆగ్రహం..**

బాన్సువాడ దవాఖానలో ఆర్‌ఎంవో అందుబాటులో లేకపోవడంపై సబ్ కలెక్టర్ కిరణ్మయి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌ఎంవోకు ఫోన్ చేసిన ఆమె.. దవాఖానా రెస్పాన్స్ మీదే కదా.. మీరే లేకపోతే ఎలా? అని నిలదీశారు. సిబ్బంది కూడా అందుబాటులోకి రాకపోవడంపై మండిపడిన ఆమె.. ఇది కరెక్ట్ పద్ధతి కాదన్నారు. వెంటనే దవాఖానకు రావాలని ఆర్‌ఎంవోను ఆదేశించారు. మరోవైపు, కల్తీ కల్లు తయారు చేసి, విక్రయిస్తున్న దుకాణాల లైసెన్సులు రద్దు చేయాలని ఎక్సైజ్ అధికారులకు సబ్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

### ముందే హెచ్చరించిన 'నమస్తే'




ఉమ్మడి జిల్లాలో జోరుగా సాగుతున్న కల్తీ కల్లు దందాపై నమస్తే తెలంగాణ ఈ నెల 2వ తేదీన ప్రత్యేక కథనం ప్రచురించింది. అధికార పార్టీ నేతల అండదండలు, ఎక్సైజ్ సిబ్బంది ఉదాసీనతతో కల్తీ కల్లు మాఫియా రెచ్చిపోతున్న తీరును స్పష్టంగా వివరించింది. ఉమ్మడి జిల్లాలో కల్తీ కల్లు ఏరులై పారుతున్నా ఎక్సైజ్ శాఖ నిద్రమత్తులో జోగుతున్న వైనాన్ని ఎత్తిచూపింది. అధికారులు అప్పుడే స్పందించి ఉంటే అమాయకులు ఇలా దవాఖాన పాలయ్యే పరిస్థితి ఉండేది కాదని బాధిత కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

### దౌల్తాపూర్‌లో వైద్య శిబిరం

**బాధితుల నుంచి రక్తనమూనాల సేకరణ**

బిచ్కుంద, ఏప్రిల్ 7: మండలంలోని దౌల్తాపూర్ గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో కొందరు కొన్ని రోజులుగా మోకాళ్లు, కీళ్లు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. వారిని పట్టించుకునేవారు కరవవడంతో నమస్తే తెలంగాణ దినపత్రికలో 'మంచం పట్టిన దౌల్తాపూర్' శీర్షికన సోమవారం కథనం ప్రచురితమైంది. దీనికి వైద్యారోగ్యశాఖ, పంచాయతీ అధికారులు స్పందించారు. సోమవారం వైద్య సిబ్బంది గ్రామంలోని ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసి బాధితులను గుర్తించి, వారి నుంచి రక్త నమూనాలను సేకరించారు. అవసరమున్న వారికి మందులను అందజేశారు. పంచాయతీ కార్యదర్శి ఆశిష్ కార్మికులతో వీధుల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రిసిల్లా, పోచయ్య, రోజా,ప్రియాంక,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.